ప్రజాశక్తి
శుక్రవారం 7 మార్చి 2025
5
అల్లూరి సీతారామరాజు

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి- అనంతగిరి : సంక్షేమ పథకాల అమలు, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తప్పవని ఎంపిడిఒ ఎవివి. కుమార్ హెచ్చరించారు గురువారం అనంతగిరి సచివాలయంలో పి4 సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగాన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని 14 సచివాలయాల సిబ్బంది పనితీరుపై సమీక్షించి పూర్తి నివేదిక అందించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాల మేరకుఅనంతగిరి సచివాలయాన్ని సందర్శించి సిబ్బంది పనితీరు, రికార్డులు అందుబాటులో ఉన్నాయా లేదా, ప్రభుత్వ పథకాల అమలుతీరుపై సమీక్షించామన్నారు

సాధనతో 'పది'లో విజయం

- ఒత్తిడి మాని, ఆత్మవిశ్వాసం పెంచుకోవాలి
- ఒక్క మార్కునూ వదలొద్దు!
- టెన్త్ విద్యార్థులకు విషయ నిపుణుల సూచనలు

తలారిసింగి పాఠశాలలో టెన్త్ విద్యార్థులను దగ్గరుండి చదివిస్తున్న హెచ్‌ఎం, టీచర్

ప్రజాశక్తి -పాడేరు టౌన్ : విద్యార్థుల భవిష్యత్తుకు తొలిమెట్టు, పునాదిలాంటి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 17 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో నూరు శాతం ఉత్తీర్ణత లక్ష్యంగా విద్యాశాఖ కార్యాచరణ అమలు వస్తోంది. విద్యార్థులు కూడా ఈ మేరకు రేయింబవళ్లు కృషి చేస్తున్నారు. అయితే ఒత్తిడి భయం లేకుండా సునిశిత పరిశీలన ఆత్మవిశ్వాసంతో సిద్ధమైతే అన్ని సబ్జెక్టుల్లో మంచి మార్కులు సాధించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో జిల్లాలోని 258 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి 11,766 మంది పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. ఆయా సబ్జెక్టుల్లో శతశాతం మార్కుల సాధనకు సంబంధిత సబ్జెక్ట్ నిపుణులు కొన్ని మెళకువలను విద్యార్థులకు సూచించారు.

ఇంగ్లీష్ గ్రామర్‌పై పట్టు సాధించాలి

ఆంగ్లంలో ముఖ్యంగా గ్రామర్‌పై పట్టు సాధించాలి రీడింగ్, కంప్రెహెన్షన్, వాయిస్, ఎడిటింగ్, ఆర్టికల్స్, రిపోర్టెడ్ స్పీచ్, కాన్వర్జేషన్ ప్రశ్నలు పక్కాగా నేర్చుకోవాలి. ఇచ్చిన ప్రశ్నలు, పాసేజ్‌లను బాగా అర్థం చేసుకుని రాయాలి. స్టడీ స్కిల్స్, డేటా ట్రాన్స్‌ఫర్, డైరీ, లెటర్ రైటింగ్ నుంచి ఎక్కువ మార్కులు వస్తాయి. రిపోర్టెడ్ స్పీచ్, ప్యాసివ్ వాయిస్, యాక్టివ్ వాయిస్‌లను బాగా సాధన చేస్తే వెనుకబడిన విద్యార్థులు కూడా ఉత్తీర్ణత మార్కులు సులభంగా సాధించవచ్చు.

- కె.నీలకంఠం, స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)
జిటిడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాల, హుకుంపేట

సులభమనే భావన వద్దు

సాంఘిక శాస్త్రం చాలా సులువనే భావనతో నిర్లక్ష్యం చేస్తే మార్కులు తగ్గిపోయే ప్రమాదముంది. ప్రధానంగా భౌగోళిక స్వరూపాలపై అవగాహన పెంచుకోవాలి. భారతదేశంలో పాటు ప్రపంచ పటాన్ని సాధన చేయాలి. ఎస్ఎస్‌సి బోర్డు విడుదల చేసిన మోడల్ పేపర్, బ్లూప్రింట్‌లో చూపిన విధంగా 1, 2, 4, 8 మార్కులు ప్రశ్నలు ఏ పాఠ్యాంశాల నుంచి ఇచ్చారో పబ్లిక్ పరీక్షల్లోనూ అవే పాఠ్యాంశాల నుంచి వచ్చే అవకాశం ఉంది. జవాబులు పాయింట్ల వారీగా రాయడంతో పాటు అందులో మ్యాటర్ ఉంటే శతశాతం మార్కులు సాధించవచ్చు. రేఖా పటాలు, విషయ అవగాహనతో ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. 8 మార్కుల ప్రశ్నకు తగిన సమాధానంతో పాటు ఒక పేరాలో వ్యాఖ్య రాస్తే మంచి మార్కులు పొందవచ్చు.

- కె.సుమిత్ర, హెచ్‌ఎం,
గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల,తలారిసింగి

పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోండి

తెలుగు భాషపై పట్టు, పాఠ్యాంశాలపై పూర్తి అవగాహన ఉంటే మంచి మార్కులు సాధించవచ్చు. అవగాహన,ప్రతిస్పందన విభాగం నుంచి ఎక్కువ మార్కులు సాధించవచ్చు. పద్య భాగం నుంచి కవి పరిచయాలు, గద్యభాగం నుంచి కథానిక, వ్యాసం, నాటకం ప్రక్రియలు చదవాలి. రామాయణం నుంచి పాత్ర స్వభావం నేర్చుకోవాలి. ప్రత్యక్షదైవాలు పాఠాన్ని అవగాహన చేసుకుని చదవాలి. సృజనాత్మక ప్రశ్నకు మార్కులను సులభంగా పొందవచ్చు. వ్యాకరణాంశాలపై పట్టు సాధిస్తే తెలుగులో 95కు పైగా మార్కులు సాధించవచ్చు. చక్కని చేతిరాతతో పాటు అక్షర దోషాలు లేకుండా సమాధానాలు రాయాలి.

కె.అరుణ, స్కూల్ అసిస్టెంట్(తెలుగు)
జిటిడబ్ల్యూ బాలికల ఆశ్రమ పాఠశాల, కందమామిడి, పాడేరు

లెక్కల్లో చక్కగా...

గణితంలో నూరు శాతం మార్కుల సాధన ఎంతో సులభం. గణితంలో రెండో అధ్యాయంలోని గ్రాఫ్ ప్రశ్నలుంటాయి. వాస్తవ సంఖ్యలు, నిరూపక జ్యామితి, సాంఖ్యక శాస్త్రం, సంభావ్యత, రేఖీయ సమీకరణాలు, బహుపదులపై పట్టు సాధిస్తే వెనుకబడిన విద్యార్థులు సైతం 50కి పైగా మార్కులు సాధించవచ్చు. గ్రాపులు, పటాలను సాధన చేస్తే మరో 15 మార్కులు పొందవచ్చు. వర్గ సమీకరణాలు, త్రికోణమితి, వత్తాలు, ఉపరితల వైశాల్యాలు, ఘన పరిమాణాలపై పట్టుతో నూరు శాతం మార్కులు పొందవచ్చు. 8 మార్కుల ప్రశ్నలకు తగిన జవాబులు ఇస్తే పూర్తి మార్పులు కచ్చితంగా వస్తాయి. అన్ని అధ్యాయాల్లో ముఖ్య సూత్రాలు, నిర్వచనాలను పునశ్చరణ చేసుకోవాలి.

ఆర్.సూర్యనారాయణ, స్కూల్ అసిస్టెంట్ (గణితం)
జిటిడబ్ల్యూ బాలుర ఆశ్రమ పాఠశాల, తలారిసింగి

విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపల్, సిఐ, ఎస్ఐ తదితరులు

మహిళా సాధికారతపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి-చింతూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాలేజీ మహిళా సాధికారత విభాగం, పోలీసు శాఖ సంయుక్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చింతూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ మహిళలు చరవాణిలు ద్వారా తమ సొంత విషయాలను ఇతరులకు పంపడంతో నేరాలు జరుగుతున్నాయని, వీరు సైబర్ నేరాల బారిన పడుతున్నారని తెలిపారు. డ్రగ్ మాఫియా నేపథ్యంలో విద్యార్థులు తమ జీవితాలను, భవిష్యత్తును పాడుచేసుకుంటున్నారని పేర్కొన్నారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రమేష్ మాట్లాడుతూ రాత్రి సమయాల్లో స్త్రీలు ప్రయాణాలు చేయడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని, అటువంటి సందర్భాలలో పోలీసులను సంప్రదించాలని కోరారు. ప్రతి మహిళా చరవాణిలో పోలీసు వారి యాప్‌ను అనుసంధానం చేసుకోవాలని, యాప్ ప్రమాదకరం నుండి కాపాడుకోవడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. మహిళలపై అఘాయిత్యం జరుగుతుందని భావిస్తే వెంటనే 112 నెంబర్కు ఫోన్ చేస్తే రక్షణ కల్పిస్తారన్నారు. అనంతరం సిఐ, ఎస్‌సి చేతులు మీదుగా మహిళా సాధికారతపై జరిగిన వక్తృత్వ పోటీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్న మాణిక్యం, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యం.శేఖర్, అధ్యాపకులు జి.వెంకటరావు, వై.పద్మ, కె.శకుంతల, కె.శ్రీదేవి, కె.శ్రీలక్ష్మి, జి.హరతి, యన్.రమేష్, నాగమోహనరావు, రాజబాబు, బి.శ్రీనివాసరావు, కె.శైలజ పాల్గొన్నారు.

ఆశాల వేతనాలు పెంచే వరకూ ఉద్యమం

అనంతగిరి, అరకులోయలో సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన.. వినతిపత్రాలు అందజేత

అరకులోయలో ఆందోళనలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ఆశ కార్యకర్తలకు వేతనాల పెంపు, ఇతర ప్రభుత్వ హామీలు అమలు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు స్పష్టం చేశారు. ఎపి ఆశ వర్కర్స్ యూనియన్, సిఐటియు ఆధ్వర్యంలో గురువారం చలో విజయవాడ నిరసనను పోలీసులతో ప్రభుత్వం నిర్బంధించడం దుర్మార్గమన్నారు. దీనికి నిరసనగా గురువారం సిఐటియు ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలో ఆశ కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు.

ఈ సందర్భంగా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు ఆరేళ్లుగా వేతనాలు పెంచలేదని, విపరీతంగా పెరుగుతున్న ధరాభారంతో అరకొర వేతనాలతో జీవనం దుర్భరమౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు..ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, .ప్రభుత్వం ప్రకటించిన గ్రాడ్యూటీ, ప్రసూతి సెలవులు, ఉద్యోగ విరమణ వయసు పెంపు, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. వైసిపి ప్రభుత్వం మాదిరిగానే కార్మిక ఉద్యమాల పట్ల కూటమి ప్రభుత్వం నిర్బంధ వైఖరి కొనసాగించడం దుర్మార్గమన్నారు. పేదలు, ఉద్యోగస్తుల పోరాటాలు అణిచివేసే ఏ ప్రభుత్వం మనుగడ సాధించలేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు కొండమ్మ, నాగమణి, సుందరమ్మ, స్వామి, చంప, ఆదివాసీ గిరిజనసంఘం మండల నేత కె.రామారావు పాల్గొన్నారు.

అనంతగిరి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో ఆశా. సిహెచ్‌డబ్ల్యూలు గురువారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని రెవిన్యూ అధికారులకు అందజేశారు ఈ సందర్భంగా స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు మాట్లాడుతూ ఆశాల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. దీనిపై జిల్లా పరిషత్, ఐటిడిఎ పాలకవర్గాల సమావేశంలో లేవనెత్తానని స్పష్టం చేశారు

అనంతగిరిలో వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు, ఆశాలు

కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి కిల్లో.మొస్య, ఆశ యూనియన్ ప్రతినిధులు అప్పలమ్మ, వరలక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు

తాటాకు, వెదురు ఉత్పత్తులకు ఢిల్లీ స్థాయిలో గుర్తింపు

- ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలో గిరిజనులు తాటాకు, వెదురులో తయారు చేసే వివిధ రకాల ఉత్పత్తుకు ఢిల్లీ స్థాయిలో మంచి గుర్తింపు ఉందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలోని తన చాంబర్‌లో గురువారం పిఒ మాట్లాడుతూ దేశ రాజధాని ఢిల్లీ రాష్ట్రపతి భవన్‌లో భారతదేశ సాంస్కృతిక వైవిధ్యానికి సంబంధించిన వేడుకలు ఈ నెల 6 నుండి 9వ తేదీ వరకు జరుగుతున్నాయని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వాలతో సహా పలు మంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమానికి సహకరించి, నిర్వహిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రపతి భవన్ లో జరిగే ఈ మహోత్సవానికి రంపచోడవరం ఐటీడీఏ వెలుగు నుండి గిరిజన కళాకారులు కుంజం నాగమ్మ, కారం విజయ కుమారి, కుర్ల చిరంజీవి రెడ్డి హాజరయ్యారని తెలిపారు. తాటాకులు, వెదురుతో తయారు చేసిన వివిధ రకాల ఉత్పత్తులు రాష్ట్రపతి భవన్‌లో ప్రదర్శనకు ఉంచడం జరిగిందని చెప్పారు. ఇలాంటి కార్యక్రమం ద్వారా ఏజెన్సీ గిరిజన ఉత్పత్తిలుకు జాతీయ స్థాయిలో ప్రమోట్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. తాటాకులు, వెదురుతో ఉత్పత్తులు తయారీకి ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన యువతీ యువకులను ప్రోత్సహించడం జరుగుతుందని పిఒ తెలిపారు.

ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయాలకు

వచ్చే విద్యాసంవత్సరానికి సొంత భవనాలు

భూములిచ్చిన రైతులతో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: మండలంలోని ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయ భవనాలను వేసవి సెలవుల అనంతరం వచ్చే విద్యాసంవత్సరంలో వినియోగంలోకి తెస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్ గౌడ్ అన్నారు. గురువారం ఏకలవ్య పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. తరగతి, వసతి, సిబ్బంది నివాస సముదాయాలతోపాటు ప్రహరీ నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణాలను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశించారు. తరగతుల నిర్వహణకు ఎటువంటి ఇబ్బందులు లేవని, పూర్తిస్థాయిలో పనుల జరిగితే పరిపూర్ణంగా ప్రారంభించడానికి వీలుంటుందన్నారు. అనంతరం పాఠశాలకు సాగు భూములిచ్చిన బాధిత గిరిజనుల దీక్షాశిబిరాన్ని సందర్శించి వారితో మాట్లాడ్లారు. పనులు పూర్తయితే ఉపాధి కల్పిస్తామన్నారు. అభివృద్ధి పనులను అడ్డుకోవడం సరికాదని, పిల్లలు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. తహశీల్దార్ నుంచి పూర్తి నివేదికను రప్పించి ఉపాధి కల్పనకు చర్యలు చేపడతామన్నారు. మానవతాదృక్పదంతో ఆందోళన విరమించాలని సూచించారు. పాఠశాల ప్రారంభానికి ముందే ఉపాధి కల్పిస్తామని భరోసానిచ్చారు.

పకడ్బందీగా టెన్త్ పరీక్షలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

విద్యాశాఖ అధికారుల సమావేశంలో మాట్లాడుత్ను ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం

ప్రజాశక్తి-రంపచోడవరం

పదో తరగతి పరీక్షలు పగడ్బందీగా నిర్వహించేందుకు తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్మెంట్ అధికారులతో పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణపై సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలలో లైట్లు, ఫ్యాన్లు, తాగునీరు వంటి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. మార్చి 17 నుండి 31వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుండి 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి పావు గంట ముందు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావు, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, టెన్త్ క్లాస్ ఎగ్జామినేషన్ అసిస్టెంట్ కమిషనర్ శశికుమార్, రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయ భాస్కర్, డిఆర్ పి రత్నరాజు, మండల విద్యాశాఖ అధికారి యం. సత్యనారాయణ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న యుటిఎఫ్ నాయకులు

మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మండల కేంద్రంలో ఈ నెల 8న సిఐటియ, యుటిఎఫ్, ఐద్వా, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో జరుగు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని యుటిఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని రేఖపల్లి ఎంఆర్‌సి వద్ద యుటిఎఫ్ మండల కమిటీ సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న యుటిఎఫ్ మండల సహధ్యక్షురాలు ఎం.విజయ మాట్లాడుతూ నేడు మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, పోరాడి ఆ హక్కులను సాధించుకోవాలని కోరారు. మహిళా దినోత్సవానికి మండలంలోని మహిళా ఉపాధ్యాయులు అందరు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మహిళా కార్యదర్శి టి.విజయకుమారి, మహిళా కార్యదర్శి కె.శారదా, ఎం.సుబ్బలక్ష్మి, జిల్లా కార్యదర్శి యస్ నాగేశ్వరరావు, జగదీష్, బాబురావు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ ఊపందుకుంటున్న ఎర్రమట్టి తవ్వకాలు

ప్రజాశక్తి-దేవీపట్నం : దేవీపట్నం మండలంలో ఎర్ర మట్టి తవ్వకాలు మళ్లీ ఊపందుకున్నాయి. గతంలో ఎర్రమట్టి తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్న తరుణంలో రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. ఇప్పుడు మళ్లీ ఎటువంటి పర్మిషన్ లేకుండా కమలంపాలం గ్రామం దగ్గరలో ఎర్రమట్టి తవ్వకాలు జరుగుతున్నాయి ఈ ఎర్రమట్టి తవ్వకాలనిను అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. దీనిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు

ట్రాక్టర్‌లో తరలిస్తున్న ఎర్ర మట్టి

కెజిహెచ్‌లో తాగునీటి ఇబ్బంది రానివ్వం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయినిగా సేవలందిస్తున్న కింగ్ జార్జ్ ఆసుపత్రికిలో రోగులకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నట్టు కెజిహెచ్ అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్ బివి.రమణ తెలిపారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్య సేవలతో పాటు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలూ కల్పించేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా గురువారం ఆసుపత్రిలోని క్యాజువాలిటీ, ధోబీ వార్డుతో పాటు ట్రామా యూనిట్, పలు విభాగాలను ఆయన సందర్శించారు.

8న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని అన్ని న్యాయ స్థానాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో జిల్లాలోని న్యాయ స్థానాలలో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్టపరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవచ్చునని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మండల కేంద్రంలో మంచినీటి కష్టాలు

నెల రోజులుగా పని చేయని కుళాయిలు

కుళాయి నుండి నీరు రావడం లేదని చెబుతున్న మహిళ

ప్రజాశక్తి-గంగవరం

మండల కేంద్రమైన గంగవరంలో తాగునీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. గంగవరంలోని వాల్మీకి వీధిలో నెల రోజులుగా మంచి నీటి కుళాయిలు పనిచేయకపోవడంతో అక్కడ ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వీధిలో గతంలో వేసిన కుళాయిలకు సంబంధించిన వాల్ పాడైపోయింది. నెల రోజులైనా నేటికీ దానికి మరమ్మతులు చేయలేదు. ఈ విషయాన్ని పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లినా నేటికీ స్పందించలేదని ఆ కాలనీకి చెందిన కొర్రపు లక్ష్మి, కొర్రపు బాలమణి, వీరభత్తుల సత్యవతి ఆరోపించారు. ఇదే పరిస్థితి గంగవరంలోని పలు వీధుల్లో నెలకొని ఉంది. అయినా సంబంధిత పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో జల్ జీవన్ మిషన్ ద్వారా చేపట్టిన ఇంటింటికి కుళాయిలు పనులు పూర్తి స్థాయి చేయలేదు. పలు చోట్ల పైపులు బిగించకపోవడంతో కుళాయిలు అలంకారప్రాయంగా ఉన్నాయని గ్రామస్తులు వాపోతున్నారు.

జిసిసి గ్యాస్ గొడౌన్ కంప్యూటర్ ఆపరేటర్

విధులకు గైర్హాజరుపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు జిసిసి గ్యాస్ గొడౌన్ కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ ఏడాది నుంచి విధులకు హాజరు కావడం లేదని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సీలేరు సర్పంచి పాంగి దుర్గో పేర్కొన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ గ్యాస్ గొడౌన్‌లో కంప్యూటర్ ఆపరేటర్ లేక వినియోగదారుల అనే ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. కంప్యూటర్ ఆపరేటర్ ప్రవీణ్ విధులకు హాజరుకాకుండా విధులకు హాజరైనట్లు చూపించి దర్జాగా జీతం తీసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జీసీసీ గ్యాస్ గొడౌన్ అధికారులు ఇంత జరుగుతున్న చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. అసలు ప్రవీణ్ విధుల్లో కొనసాగుతున్నారా? లేదా? గొడౌన్ అధికారులు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఒకవేళ కంప్యూటర్ ఆపరేటర్‌గా ప్రవీణ్ పనిచేయకపోతే ఆయన స్థానంలో వేరొకరిని తక్షణమే నియమించాలని కోరారు. ఈ విషయమై సమగ్రమైన విచారణ చేపట్టి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొంత్రాయిగుడలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్: మండలంలోని బస్కి పంచాయతీ కొంత్రాయిగూడ గ్రామంలో గురువారం కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. జలజీవన్ మిషన్ పథకం కింద కొంత్రాయిగూడలో బోరు తవ్వినప్పటికీ, విద్యుత్ సరఫరా లేకపోవడంతో ఇన్నాళ్లుగా నీటి పథకం, ఇంటింటి కుళాయిలు వినియోగంలోకి రాని పరిస్థితి ఉంది. ఈ నేపథ్యంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి, కనెక్షన్ ఇవ్వాలని స్థానికులతో ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఇన్నాళ్లుగా మొరపెట్టుకుంటున్నా ఎట్టకేలకు ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. గ్రామంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యుత్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇపుడు ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి, విద్యుత్ మోటారు బిగించడంతోపాటు ఇంటింటికి కుళాయిలను ఏర్పాటు చేసి నీటి సరఫరా కల్పించాలని కోరుతున్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్యదర్శి కె దేవన్న,గిరిజన సంఘం పంచాయతీ నాయకులు సింహాద్రి,సర్పంచ్ కోశ్వరరావు ,కన్నయ్యసుబ్బారావు, రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

విద్యార్థినులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ పాపినాయుడు

ప్రజలకు రక్షణ కల్పించడమే లక్ష్యం

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ప్రజలకు అవసరమైన సేవలు అందించడంతోపాటు పూర్తి భద్రత, రక్షణ న్యాయం అందించడంతో పోలీసుల సంకల్పం, లక్ష్యమని ఎస్ఐ పాపినాయుడు అన్నారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కస్తూర్బాగాంధీ గురుకుల విద్యాలయం బాలికలతో ఆత్మీయ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా వారోత్సవాల సందర్భంగా విద్యార్థినిలకు మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. సమాజంలో పురుషులతో సమానంగా మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. విద్యార్థి దశలోనే చట్టాలు, హక్కులు పట్ల అవగాహన కలిగి ఉండాలని, ఉన్నత చదువులకు చదివి భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని సూచించారు. పోలీసులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్లో సిఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలు పాఠశాలల విద్యార్థులతో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు బయట సమాజంపై అవగాహన కలిగి ఉండాలని, ఎటువంటి సమస్యలు వచ్చినా తమ దృష్టికి తెస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షణ్ముఖరావు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జెవిఎస్ఎన్ బెయిల్‌పై విడుదల

ప్రజాశక్తి - ఆరిలోవ : ఎల్‌జి పాలిమర్స్ కేసులో గత శుక్రవారం అరెస్టయిన సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి గురువారం కేంద్రకారాగారం నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. కేంద్రకారాగారం వద్దకు చేరుకున్న సిపిఐ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, రీకాల్ చేసుకోలేదన్న నెపంతో ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న వారిని అరెస్టు చేసి రిమాండుకు పంపించడం సరికాదన్నారు. ఇది కేవలం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటమేనని పేర్కొన్నారు.

గిరిజన ఆవాసాల్లో బసకు ప్రతిపాదనలు

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : పర్యాటకులు గిరిజన ఆవాసాల్లో బస చేయడానికి (హోమ్ స్టే) ప్రతిపాదనలు సిద్దం చేసి ఈనెల 15లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ సూచించారు.. గురువారం తహశీల్దారులు, ఎంపిడిఒలు, పర్యాటక, అటవీ శాఖ అధికారులతో పర్యాటకాభివృద్ధిలో భాగంగా గిరిజన ప్రాంతాలలో సందర్శకుల హోంస్టేపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వయం సహాయ సంఘాలు, గ్రామైక్య సంఘాల ఆధ్వర్యంలో హోంస్టే ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తుందన్నారు. హోంస్టేల ద్వారా గిరిజనులు ఆర్థికంగా ఆదాయం పొందుతారన్నారు. గిరిజనుల సామాజికాభివృద్ధి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయాన్నారు. రంపచోడవరం డివిజన్‌లో గుడిసె, మారేడుమిల్లి అరకు వ్యాలీ మండలం పెదలబుడు, చొంపి, మాడగడ గ్రామాల్లో హోంస్టేలు ఏర్పాటుకు పరిశీలించాలన్నారు. చింతూరు డివిజన్‌లో గిరిశిఖర గ్రామాలను గుర్తించాలన్నారు. చింతపల్లి మండలంలో తాజంగి, లంబసింగి గ్రామాలను పరిశీలించాలని ఎంపిడిఒను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలలో స్వచ్ఛాంధ్ర కింద సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. షెడ్యూల్డ్ ఏరియాలోని పర్యాటక ప్రాంతాలు కలుషితం కాకుండా ఏప్రిల్ నుండి ప్లాస్టిక్‌ను సంపూర్ణంగా నిషేధిస్తామన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై చెక్ పోస్టులు ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయం సిబ్బంది, పంచాయతీ సిబ్బంది తనిఖీలు చేసి ప్లాస్టిక్ వినియోగాన్ని నిరోధించాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎం.జె. అభిషేక్ గౌడ్, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, డిఆర్‌డిఎ పీడీ వి.మురళి, సిపిఒ ఎస్.ఎస్ఆర్‌కె పట్నాయక్, డిటిఒ.దాసు, అరకు వ్యాలీ మ్యూజియం క్యూరేటర్ మురళి, 22 మండలాల ఎంపిడిఒలు, తాహశీల్దారులు,ఇఒపిఆర్‌డిలు,ఎపిఎఫ్‌డిసి, అటవీ అధికారులు, వర్చువల్‌గా రంపచోడవరం ఐటిడిఎ పిఒ సింహాచలం పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

అర్హులకు పింఛన్లు మంజూరు చేయండి

సిపిఎం ఆధ్వర్యాన నిరసన - వినతిపత్రం అందజేత

వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి - ముంచింగిపుట్టు : మండలంలో అర్హులైన వారందరికీ పింఛన్లు మంజూరు చేయాలని సిపిఎం నేతలు కోరారు. గురువారం కర్రిముఖిపుట్టు గ్రామ సచివాలయ పరిధిలో జర్రెల గ్రామ పంచాయతీ డేగలపుట్టు, సెల్లుంపుట్టు, జర్రెల, బొడ్డగొంది గ్రామాల వికలాంగులు, వితంతువులు, వయోవృద్ధులకు తక్షణమే గుర్తించి పింఛను మంజూరు చేయాలని కోరుతూ గురువారం కర్రిముఖిపుట్ గ్రామ సచివాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టి, పార్టీ మాజీ మండల సెక్రెటరీ భీమరాజు, సీనియర్ నేత వంతల లైకోన్ ల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఫణీంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లైకోన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నప్పటికీ వితంతులకు, వయోవృద్ధులు, అంగవైకల్యం కల వారికి పింఛన్ల మంజూరు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందని మండిపడ్డారు. గతంలో వితంతులకు నెల రోజుల్లోనే పింఛను మంజూరు చేశారని, అయితే సదరం సర్టిఫికెట్లు ఉన్న వికలాంగులు, అర్హులైన వృద్ధులకు పింఛన్లు మంజూరు చేయడం లేదన్నారు. జర్రెల పంచాయతీ పరిధిలోని 20 మంది పింఛనుకు అర్హులున్నారని, అయితే వారికి పింఛన్లు మంజూరు చేయకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని, లేకుంటే లబ్ధిదారులను సమీకరించి మండల పరిషత్, తహశీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు కార్యక్రమంలో హరి బందు, ఎన్ పరశురాం పాల్గొన్నారు.

గృహనిర్మాణాలను వేగవంతం చేయండి

ప్రజాశక్తి -అనంతగిరి : జన్‌మన్ పథకంలో పివిటిజిలకు కేంద్ర ప్రభుత్వం మంజూరుచేసిన ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి త్వరతగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ బాబు నాయక్ లబ్ధిదారులకు సూచించారు. గురువారం మండలంలోని కాశీపట్నం పంచాయతీ పరిధి గ్రామంలో సందర్శించారు కాశీపట్నం, పల్లంవలస, కాటూరు,. చుట్టుప్రక్కల గ్రామాల్లో గృహనిర్మాణాలను పరిశీలించారు ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల ప్రాప్తికి ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తామనిస్పష్టం చేశారు ఇప్పటికీ పనులు మొదలు పెట్టని లబ్ధిదారులు వెంటనే పనులు చేపట్టి, వేగవంతం చేయాలని కోరారు. ఇళ్ల బిల్లులు మంజూరు కానీ లబ్దిదారులు, మండల హౌసింగ్ శాఖ అధికారులను కలిసి వివరాలు అందజేయాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక హౌసింగ్ ఎఇఇ నాగేశ్వరరావు పాల్గొన్నారు

హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ

నేరాలు ఘోరాలు

అగ్ని ఆహుతైన కాఫీ, సిల్వర్ తోటలు

దగ్ధమైన తోటలు

ఆరు ఎకరాల్లో కాఫీ, సిల్వర్‌వోక్ తోటల దగ్ధం

ప్రజాశక్తి -అనంతగిరి : మండలంలోని పైనంపాడు పంచాయతీ మూల పటం గ్రామంలో ముగ్గురు రైతులకు చెందిన ఆరు ఎకరాల కాఫీ, సిల్వర్‌వోక్ తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన సింధు కోడి నాగేశ్వరరావు, సింధు కోడి ఆనందరావు, జన్ని తెల్లన్న.లకు చెందిన ఆరు ఎకరాల కాఫీ సిల్వర్ తోటలకు గురువారం మధ్యాహ్నం కాలిపోయాయి. గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడం వల్లే ప్రమాదం జరిగిందని అనుమానిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఏటా లక్షల రుపాయల ఫలసాయానిన అందించే తోటలు కాలిబూడిదయ్యాయని బాధిత రైతులు విలపిస్తున్నారు. ఐటిడిఎ, హార్టీకల్చర్ అధికారులు వెంటనే స్పందించి, పంట నష్టాలను అంచనా వేసి బాధిత రైతులను ఆదుకోవాలని కోరారు. ప్రస్తుత పంట నష్టపరిహారం ఇవ్వడంతోపాటు మళ్లీ తోటలు పెంచేందుకు అవసరమైన సాయం అందించాలని, ఐటిడిఎ ద్వారా కాఫీ, సిల్వర్‌వోక్ మొక్కలను ఉచితంగా ఇవ్వాలని బాధిత రైతులు వేడుకున్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - ఆరిలోవ : మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఆరిలోవ ఎస్ఐ కృష్ణ కథనం ప్రకారం... ఆరిలోవ దుర్గాబజార్‌కు చెందిన టి.మణికంఠకు పదోతరగతి చదువుతున్న కుమార్తె ఉంది. ఫోన్ విషయమై తండ్రి, కూతురు మధ్య వివాదం జరిగింది. దీంతో మనస్థాపానికి గురైన తండ్రి మణికంఠ ఫిబ్రవరి 24న పురుగుల మందు తాగాడు. అప్పటి నుంచి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మణికంఠ పరిస్థితి విషమించడంతో గురువారం మృతి చెందాడని పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేస్తున్న బాలరాజు

టెన్త్ విద్యార్థులకు పరీక్షా సామగ్రి అందజేత

ప్రజాశక్తి -జి.మాడుగుల:: మండలంలో గాంధీనగరం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు వైయస్సార్ టిఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మెన్ డాక్టర్ తెడబారికి సురేష్ కుమార్ ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష సామగ్రి అట్టలు పెన్నులను మాజీ మంత్రి మత్స్యరాస బాలరాజు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులందరూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెంకట గంగరాజు, రామరాజు హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

సర్టిఫికెట్‌ను అందజేస్తున్న పిఒ కట్టా సింహాచలం

మెరుగైన వైద్య సేవల్లో ఏరియా ఆసుపత్రికి సర్టిఫికెట్

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని గిరిజన రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించినందుగాను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి కేంద్ర ప్రభుత్వం గుర్తించిన నేషనల్ హెల్త్ సిస్టం ద్వారా సర్టిఫికెట్ లభించింది. ఈ మేరకు ఈ సర్టిఫికెట్‌ను ఏరియా ఆసుపత్రిలో రంపచోడవరం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం చేతుల మీదుగా ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి, ఆర్ఎం వెంకట ఇందిరా, డాక్టర్ ఆదిలక్ష్మి, డాక్టర్ క్రాంతి, డాక్టర్ సుగుణ, డాక్టర్ ప్రేమ్, సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ ఈ ఏడాది జనవరి 20, 21 తేదీలలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రిని ఢిల్లీ నుండి డాక్టర్ గోపాల్, డాక్టర్ రియాజ్ బృందం సందర్శించిందని, ఆ బృందం క్వాలిటీ వైద్య సేవలు అందించడంపై (ముస్కాన్) పరిశీలించడం జరిగిందని తెలిపారు. ఏరియా ఆసుపత్రిలో ఈ ప్రాంత రోగులకు ఏవిధంగా వైద్య సేవలు అందిస్తున్నది క్షుణ్ణంగా పరిశీలించిందని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రంపచోడవరం ఏరియా ఆసుపత్రి అగ్రమిగా ఉండడంతో నేషనల్ హెల్త్ సిస్టం ద్వారా ఎంపిక చేసి సర్టిఫికెట్ పంపించినట్లు తెలిపారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ శేషారెడ్డి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, ఐటిడిఎ పిఒ, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాల డిసిహెచ్ఒల ప్రోత్సాహం, ఆసుపత్రి వైద్యాధికారులు, సిబ్బంది కృషి వల్ల ఈ సర్టిఫికెట్ పొందగలిగామని తెలిపారు. మరింత ఉత్సాహంతో ఏజెన్సీలోని మారుమూల ప్రాంతాల నుండి వచ్చిన రోగులకు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు.

ఘనంగా గెత్సేమనే చర్చి 13వ వార్షికోత్సవం

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరులోని గెత్సేమనే క్రైస్తవ ప్రార్థనా మందిరం 13వ వార్షికోత్సవం పాస్టర్ జాన్ మోజేస్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పేద విద్యార్థులకు అట్టలు, పెన్నులు ఏపీ జెన్కో ఈఈ రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ముందుగా చర్చిలో పాస్టర్ జాన్ మెజేష్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం చర్చ ప్రాంగణంలో కుల మతాలకతీతంగా సహఫంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం పాస్టర్ అజీరియా, సీలేరు ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి-సీలేరు : పరిసరాల పరిశుభ్రత, ఇంటింటి నుండి చెత్త సేకరణ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని జీకే వీధి ఇఒపిఆర్‌డి పాపారావు పిలుపునిచ్చారు. జీకే వీధి మండలం సీలేరులో ఇంటింటి నుండి చెత్త సేకరణ కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంటి పరిసరాలతో పాటు వీధుల్లో కూడా పరిశుభ్రత పాటించాలని ప్రజలకు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే వ్యాధులు దరిచేరే పరిస్థితి ఉండదని తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఆదేశాలకు అనుగుణంగా ప్రతి వారంలో మంగళ, గురు, శనివారం చెత్త సేకరణ కార్యక్రమాన్ని తూచ తప్పుగా నిర్వహిస్తామని వెల్లడించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు రోడ్లపై విచ్చలవిడిగా పడవేయరాదని సూచించారు. పర్యావరణం పరిశుభ్రంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీలేరు సర్పంచ్ దుర్జో, ఎంపీటీసీ పిల్లా సాంబమూర్తి, ఉపసర్పంచ్ కే వల్లి ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి పరుశురాం, పంచాయతీ గుమస్తా ప్రకాష్, వార్డు సభ్యులు చిటికెల రాము, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ విజయ, వెల్ఫేర్ అసిస్టెంట్ కుమారి, యానిమల్ అసిస్టెంట్ అనుష్క, క్లాత్ మిత్ర సభ్యులు పాల్గొన్నారు.

ప్రపంచ చరిత్రకు పుస్తకరూపం

దగ్గుబాటి పుస్తకావిష్కరణలో సిఎం చంద్రబాబు - గీతం వేదికగా ఒకేచోట నలుగురు రాజకీయ దిగ్గజాలు
హాస్యం, వ్యంగ్యం, చమత్కారాలు, సందర్భోచిత వాగ్బాణాలతో సాగిన కార్యక్రమం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

కొన్ని వేల సంవత్సరాల మానవ పరిణామ క్రమాన్ని, ప్రపంచ చరిత్రను పుస్తక రూపంలో.. అది కూడా తెలుగులో రచించడం అద్భుత ప్రయత్నమని, ఆ పుస్తకాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు ఉద్ఘాటించారు. నగరంలోని రుషికొండలోగల గీతం యూనివర్శిటీలో గురువారం ఉదయం మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు రచించిన 'ప్రపంచ చరిత్ర' (ఆదిమ కాలం నుండి నేటి వరకూ - ఆ తర్వాత) పుస్తకాన్ని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యానాయుడు, బిజెపి ఎంపీ పురంధరేశ్వరి, విశాఖ టిడిపి ఎంపీ శ్రీభరత్ తదితరులతో కలిసి ఆవిష్కరించిన అనంతరం చంద్రబాబు ప్రసంగించారు. 'మా కుటుంబం నుంచి ఒక మంచి రచయిత ఉన్నాడని నేనింతవరకూ అనుకోలేదు' అని చంద్రబాబు నవ్వుతూ అన్నారు. 'రచయిత కాని రచయిత నా తోడల్లుడు' అని కొనియాడారు. యుద్ధాలు, సామ్రాజ్యాల ఆవిర్భావం, మత పెద్దల పెత్తనాలు, ఖండాల విభజన, బానిస వ్యవస్థ, ఆదిమ కాలం, అభివృద్ధి ఇలా ఏ విషయాన్నీ వదలిపెట్టకుండా ఈ పుస్తకంలో వెంకటేశ్వరరావు పొందుపరచడం గర్వకారణంగా ఉందన్నారు. భాష, వాస్తు, కళలు, శిల్పం, భూ సంస్కరణలు, సామాజిక న్యాయం, భూస్వామ్య వ్యవస్థ, రాజులతో పాటు ఎపిలో ప్రజాపాలన గురించి, అచ్చుయంత్రం, సాంకేతిక విప్లవం, భవిష్యత్‌లో ఏం జరుగబోతుందో ముందే ఊహించి దీంట్లో రాయగలగడం గొప్ప విషయమన్నారు.

మాట్లాడుతున్న చంద్రబాబు, వేదికపై నిర్మలా సీతారామన్, వెంకయ్యనాయుడు

హాస్యం...వ్యంగ్యం..చమత్కారాలు..

సభికులంతా నవ్వుల్లో మునిగితేలే విధంగా వేదికపై ఆశీనులైన దిగ్గజ రాజకీయ నాయకులంతా ప్రసంగాల్లో హాస్యం కురిపించారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ముఖ్య అతిథిగా ఈ పుస్తకావిష్కరణకు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఎంపీ పురంధరేశ్వరి, పుస్తక రచయిత దగ్గుబాటి వెంకటేశ్వరరావు విచ్చేశారు. 'పాత వైరాలు.. పరస్పర వ్యవహారాలపైనా హాస్యంగా వ్యంగ్యాస్త్రాలు గుప్పించుకున్నారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను 30 ఏళ్ల తర్వాత వేదికపైకొచ్చి మాట్లాడుతున్నానని, రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్నానని అన్నారు. తాను సైన్స్ స్టూడెంట్‌నైనా చరిత్ర చదివేందుకు శ్రమించానని తెలిపారు. తనకు చంద్రబాబుకు మధ్య వైరం ఉంది అంటారని, ఉన్నమాట వాస్తవమేనని అనగానే సభికుల నుంచి నవ్వులు విరిశాయి. జీవితంలో గందరగోళం అక్కర్లేదని, జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించాలని అన్నారు. గతం మరచిపో భవిష్యత్‌వైపు సాగిపో అన్నదే నిజమన్నారు. తాను పలు దేశాలు తిరిగాక శాస్త్రవేత్తలు గొప్ప విషయం ఒకటి తెలిపారని ఆయన చెబుతూ... వచ్చే ఐదేళ్లలో గొప్ప ఆవిష్కరణ జరగబోతుందని, అది సక్సెస్ అయితే ఇప్పుడు వయసులో ఉన్నవారు కూడా ఆ తర్వాత 50 ఏళ్ల వరకూ జీవించే టెక్నాలజీ అందుబాటులోకి రానుందని దగ్గుబాటి చెబుతూ 'చంద్రబాబు దీని గురించి ఎక్కువ నువ్వు ఆలోచించొద్దని.. లోకేష్‌కు కోపం వస్తుందని అంటూ వ్యంగ్య వ్యాఖ్యానం చేశారు. దీంతో సభ ఒక్కసారిగా గొల్లుమని నవ్వులు వినిపించాయి. చంద్రబాబు మాట్లాడుతూ నా తోడల్లుడు సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నాడని ఆయన్నే అడిగానని, ఆయన అలవాట్లు చెబుతూ 'మధ్యాహ్నం పూట పేకాట' ఆడ్డానికి కూడా వెళ్తాడని చెప్పాడని అనగానే సభలో నవ్వులు విరిశాయి. ఐదేళ్ల తర్వాత 50 ఏళ్లు జీవించే ఆవిష్కరణ వస్తే అంతకే ఎవ్వరూ పరిమితం కారని, శాశ్వతంగా ఉండిపోయే ఆవిష్కరణకు ప్రయత్నిస్తారని చంద్రబాబు అనడంతో అందరూ చప్పట్ల వర్షం కురిపించారు. వెంకయ్యనాయుడు మాట్లాడుతూ 'చంద్రబాబు మంచి పాలనాదక్షుడేనని, అయితే ఓవర్ కాన్ఫిడెన్స్‌తో వర్తమానం గురించి కాకుండా దీర్ఘకాల ప్లాన్‌లు వేయడం సరైంది కాదని, అన్నీ దృష్టిలో పెట్టుకుని రాష్ట్రం గురించి ఆలోచించాలని పరోక్షంగా చురకలు అంటించారు. తాను ఏ విషయమైనా సూటిగా చెబుతానని తనకు పదవీ విరమణేగానీ 'పెదవీ' విరమణ లేదనడంతో సభలో ఒక్కసారి నవ్వులు, చప్పట్లు కురిశాయి.

గిరి మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు పోలీస్ స్టేషన్లో సిఆర్పిఎఫ్ 42జి బెటాలియన్ ఆధ్వర్యంలో గిరిజన మహిళలకు కుట్టుమిషన్లను గురువారం పంపిణీ చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా సిఆర్పిఎఫ్ కమాండెంట్ ధర్మ ప్రకాష్, ఎస్ఐ కే.రవీంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా ధర్మప్రకాష్ మాట్లాడుతూ సివిక్ యాక్షన్ ప్రోగ్రామ్‌లో భాగంగా దుప్పిలివాడ, సీలేరు పంచాయతీల పరిధిలో 11మంది మహిళలకు ఎంపిక చేసి, వారికి ప్రత్యేకంగా నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చామని తెలిపారు. ఇందులో భాగంగా వారు స్వచ్ఛందంగా ఉపాధి పొందేందుకు కుట్టు మిషన్లు పంపిణీ చేశామన్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశామన్నారు. సిఆర్పిఎఫ్ జి42 బెటాలియన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు మారుమూల గ్రామాల్లో చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ డిప్యూటీ కమాండెంట్ జెఎస్ శకావత్, స్థానిక ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

కుట్టు మిషన్ అందజేస్తున్న ధర్మ ప్రకాష్

ప్రోగ్రాం వివరాలను వెల్లడిస్తున్న ఆకాష్ ప్రతినిధులు

ఇన్విక్టస్ జెఇఇ ప్రిపరేషన్ ప్రోగ్రామ్ ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆకాశ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ అత్యంత ప్రతిష్టాత్మకమైన, ప్రత్యేకమైన ఆకాశ్ ఇన్విక్టస్ పేరిట అధునాతన జెఇఇ ప్రిపరేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభిస్తున్నట్లు సంస్థ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ దీపక్ మెహ్రోత్రా తెలిపారు. గురువారం నగరంలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఆకాశ్ విద్యార్థులు, తల్లిదండ్రుల సమావేశంలో ఈ నూతన ప్రాజెక్టును జ్యోతి వెలిగించి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐఐటిలలో లేదా విదేశాల్లో ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలలో చేరాలని లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థుల కోసం రూపొందించిన ఈ ప్రోగ్రామ్ అత్యంత ప్రాముఖ్యత కలిగినదన్నారు. ఎఐ ఆధారిత, ఫలితాలకు ప్రాధాన్యమిచ్చే కార్యక్రమమని పేర్కొన్నారు. ఆకాశ్ ఇన్విక్టస్ ద్వారా దేశవ్యాప్తంగా అత్యుత్తమ 500 జెఇఇ ఫ్యాకల్టీ మెంబర్స్ అందుబాటులో ఉంటారన్నారు. ఐఐటిలో అత్యున్నత ర్యాంకులు సాధించాలనుకునే విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ప్రత్యేకంగా రూపొందించబడిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటిసారిగా విశాఖపట్నం, విజయవాడ పట్టణాల్లో ఈ కొత్త కోర్సును గురువారం నుంచి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సౌత్ ఇండియా అకడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్ కుమార్ మిశ్రా, స్టేట్ అకడమిక్స్ హెడ్ జెఆర్‌విఎస్ఎన్.మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ వై.లక్ష్మీనారాయణ, ఈశ్వర్ ప్రసాద్ పాల్గొన్నారు.

నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ధర్నా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సివిల్ సప్లై హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సివిల్ సప్లై హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శ జిఎస్‌జె.అచ్యుతరావు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరసరఫరాల వ్యవస్థ ప్రారంభం నుండి వారు పని చేస్తున్నప్పటికీ వారి సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు ఎం.మన్మథ రావు, పడాల రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం

ప్రజాశక్తి-విఆర్.పురం : మండలంలోని రామవరం పంచాయితీ పరిధి రామవరంపాడు గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం సోల నరసింహారావుకు చెందిన తటాకుల ఇల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో రామవరం గ్రామంలో ఎంట్లో ఎవరూ లేరు. అందరూ మిర్చి కోతలకు పొలంలో పనికి వెళ్లారు ఇంట్లో ఉన్న సామగ్రి మొత్తం కాలి బూడిదయైంది. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. అదే ఇంట్లో ఒరిస్సా నుంచి వచ్చిన వలస కూలీలు 15 మంది వుంటున్నారు. వారి సామగ్రి, బట్టలు, రేషన్, రూ.1.30 లక్షల నగదు కాలిపోయాయి. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు వివిధ సంస్థలకు సంబంధించిన వాళ్ళు కూడా స్పందించి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

విభాగాధిపతులతో విఎంఆర్‌డిఎ ఛైర్మన్ సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ ఛైర్మన్ ఎంవి.ప్రణవ్ గోపాల్ గురువారం ఉదయం విఎంఆర్‌డిఎ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో విఎంఆర్‌డిఎ విభాగాధిపతులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. సంస్థ చేపడుతున్న పలు అభివృద్ధి పనుల పురోగతిని అడిగి తెలుసుకుని క్షేత్ర స్థాయిలో పనులను వేగవంతం చేయాలని, స్థానిక శాసనసభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. పూర్తయిన పనులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కమిషనర్ రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజినీర్ వినయ్ కుమార్, ప్రధాన అర్బన్ ప్లానర్ శిల్ప పాల్గొన్నారు.